కేఎల్ఐ పెండింగ్ పనులను పూర్తి చేయాలి

- కాల్వల్లో నీళ్లుబంద్ అయ్యి మూడు నెలలైన పనులు ప్రారంభించరా..
- చేసిన పనులకే మళ్లీ మళ్లీ బిల్లులు తీసుకుంటున్న కాంట్రాక్టర్లు
- విలేకరుల సమావేశంలో కేఎల్ఐ రైతు జేఏసీ డిమాండ్

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కేఎల్ఐ రైతు జేఏసీ నాయకులు

కల్వకుర్తి, ఫిబ్రవరి 28 : జూన్ నెలాఖరు నాటికి ఎంజీకేఎల్ఐ 29వ ప్యాకేజీకి చెందిన పనులు పూర్తి స్థాయిలో పూర్తి చేయాలని కేఎల్ఐ రైతు జేఏసీ డిమాండ్ చేసింది. బుధవారం కేఎల్ఐ రైతు జేఏసీ అధ్యక్షుడు బండెల రాంచంద్రారెడ్డి అధ్యక్షతన రైతులతో కలిసి విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో జేఏసీ అధ్యక్షుడు బండెల రాంచంద్రారెడ్డి మాట్లాడుతూ కాల్వల్లో నీళ్లు బంద్ అయ్యి మూడు నెలలు కావస్తుందని, ఇప్పటి వరకు కూడా పెండింగ్ పనులు పూర్తి స్థాయిలో చేపట్టడం లేదని మండిపడ్డారు. మూడు నాలుగు చోట్ల చేపట్టిన పనులు నింపాదిగా జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కల్వకుర్తి ప్రాంతానికి 2017 అక్టోబర్‌లో 29వ ప్యాకేజీ ద్వారా కృష్ణా సాగునీరు వచ్చిందని, అప్పటి నుంచి ఏప్రిల్, మే నెల మినహా మిగతా అన్ని రోజులు కాల్వల గుండా నీరు వచ్చేదని, దీంతో పెండింగ్ పనులు చేపట్టడానికి వీలు లేకున్నదని చెప్పారు. ఇప్పుడు డిసెంబర్ నెల మొదట్లోనే కాల్వలో నీళ్లు ఆగిపోయాయని, నీటి సరఫరా నిలిచి మూడు నెలలు కావస్తున్న పెండింగ్ పనులు చేపట్టడంతో అలసత్యం ప్రదర్శిస్తున్నారని ఆరోపించారు. మూడు నెలల నుంచి అధికారులకు విజ్ఞప్తులు చేస్తున్నా వారిలో కదలిక లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లకాల్వ పనులు చాలా చోట్ల అసంపూర్తిగా ఉన్నాయని, అధికారులు మాత్రం 90శాతం పనులు పూర్తయ్యామని చెబుతున్నారని వాపోయారు. ఎక్కడెక్కడా పనులు పూర్తయ్యాయి, ఎక్కడ పెండింగ్‌లో ఉన్నాయి, కాల్వల ద్వారా ఎన్ని ఎకరాలకు నీళ్లు ఇస్తున్నారు, కాల్వల ద్వారా ఎన్ని చెరువులకు నీళ్లు నింపుతున్నారనే విషయాలను గ్రాఫ్ ద్వారా గీసి గ్రామ పంచాయతీల వద్ద అతికించాలని, అప్పుడు అన్ని విషయాలు బయటకు వస్తాయని అన్నారు. చేసిన పనులను మళ్లీ మళ్లీ చేస్తూ బిల్లులు డ్రా చేస్తున్నారనే అనుమానాలను రైతులు వ్యక్తం చేస్తున్నారని ఆయన గుర్తు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొంత గ్రామమైన కొండారెడ్డిపల్లి గ్రామం కూడా కేఎల్ఐ 29వ ప్యాకేజీలోని డీ-82లో ఉందని, కేఎల్ఐ పెండింగ్ పనుల విషయంలో ముఖ్యమంత్రి దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. చాలా చోట్ల రైతులు పిల్ల కాల్వల చుట్టు ఉన్న మట్టిని చదును చేసి కాల్వను పూడ్చి వేస్తున్నారని, కారణమేమిటంటే కాల్వలకు సంబంధించిన భూసేకరణ డబ్బులు రాకపోవడమేనని ఆవేదన వ్యక్తం చేశారు. భూసేకరణకు సంబంధించి ఎంతమంది రైతులకు ఎంత డబ్బు చెల్లించారు. ఇంకా ఎంత డబ్బు చెల్లించాలి అనే విషయమై అధికారులు స్పష్టంగా చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రధాన కాల్వకు ఇరువైపులా బీటీ రోడ్డు వేయాలనే నిబంధన ఉన్నప్పటి అలాంటి పనులు ఎక్కడా చేపట్టలేదని, కాల్వకు ఇరువైపులా ఉన్న రోడ్లు కంపచెట్లతో అల్లుకుపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. కేఎల్ఐ 29వ కాల్వ విషయమై రాష్ట్ర ప్రభుత్వం కచ్చితమైన చర్యలు తీసుకొని పెండింగ్ పనులను జూన్ నెల నాటికి సంపూర్ణంగా పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు జేఏసీ నాయకులు శ్యాంసుందర్, నర్సింహారెడ్డి, కిరణ్ రెడ్డి, కృష్ణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కవితల పోటీల్లో విద్యార్థినికి రాష్ట్రస్థాయి బహుమతి

పెద్దకొత్తపల్లి, ఫిబ్రవరి 28 : మండల పరిధిలోని వెన్నచర్ల జెడ్పీ హైస్కూల్‌కు చెందిన విద్యార్థిని దీపికకు రాష్ట్రస్థాయి కవితల పోటీల్లో బహుమతి పొందినట్లు సైన్స్ గైడ్ టీచర్ రాజశేఖర్‌రావు తెలిపారు. ఇటీవల వరంగల్ జిల్లాలో ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలి అనే అంశంపై కవిత పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో వెన్నచర్ల విద్యార్థిని దీపిక రాష్ట్రస్థాయి బహుమతి అందుకోవడంతో డీఈవో గోవిందరాజులు,సైన్స్ అధికారి కృష్ణారెడ్డి, ఎంపీపీ ప్రతాప్‌గౌడ్ అభినందించారు.

పుల్లగిరి హత్య కేసులో ముగ్గురు అరెస్టు

- వివరాలు వెల్లడించిన డీఎస్పీ శ్రీనివాస్

వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీనివాస్

నాగర్‌కర్నూల్, ఫిబ్రవరి 28 : తిమ్మాజిపేట మండలం పుల్లగిరిలో ఈనెల 25వ తేదీన సుంకరి ఆంజనేయులు హత్య కేసుకు సంబంధించి ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ శ్రీనివాస్ తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పోలీస్ హెడ్‌క్వార్టర్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ పుల్లగిరి గ్రామంలో సుంకరి సత్యయ్య, సుంకరి ఆంజనేయులు అన్నదమ్ములు. ఈనెల 25వ తేదీన ఆరుబయట వేసిన కర్ర మంచం విషయంలో ఘర్షణపడ్డారని, తాగిన మైకంలో ఆంజనేయులు అన్న సత్యయ్య కుటుంబ సభ్యులతో అదే రోజు రాత్రి సైతం గొడవ పడినట్లు తెలిపారు. తరచూ తాగుతూ తిడుతుండడంతో కోపం పెంచుకున్న సత్యయ్యతోపాటు భార్య గౌరమ్మ, కొడుకు మహేశ్‌లు గొడ్డలి, కర్రలతో ఆంజనేయులును ఇంట్లో నుంచి బయటకు ఈడ్చుకొచ్చి దాడిచేసికొట్టి చంపారని వెల్లడించారు. ఈ ఘటనపై ఆంజనేయులు భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని సత్యయ్య, భార్య గౌరమ్మ, కుమారుడు మహేశ్‌ను బుధవారం అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చగా జడ్జి రిమాండ్‌కు ఆదేశించినట్లు వెల్లడించారు. సమావేశంలో సీఐ కనకయ్య, తిమ్మాజిపేట ఎస్సై భాస్కర్ ఉన్నారు.

పెండ్లి చేసుకుంటానని మొఖం చాటేసిన యువకుడు

- యువకుడితోపాటు అతడి తల్లిదండ్రులపై కేసు నమోదు

తిమ్మాజిపేట, ఫిబ్రవరి 28 : పెండ్లి చేసుకుంటానని ఎంగేజ్‌మెంట్ చేసుకొని మొఖం చాటేసిన యువకుడితోపాటు అతని తల్లితండ్రులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై భాస్కర్‌రెడ్డి తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. మండలంలోని గుమ్మకొండ గ్రామానికి చెందిన యువతి(19)తో బిజినేపల్లి మండలం లట్టుపల్లి సమీపంలోని తండాకు చెందిన యువకుడికి పెళ్లి కుదిరింది. గత యేడాది నవంబర్‌లో ఎంగేజ్‌మెంట్ కూడా చేసుకున్నారు. తీరా పెండ్లి కోసం సంప్రదించగా ఆ యువకుడితో పాటు తల్లిదండ్రులు ఎవరూ స్పందించడం లేదు. దీంతో సదరు యువతి తండ్రి బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో యువకుడితోపాటు అతడి తల్లిదండ్రులపై కూడా కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెల్లడించారు.

నాగర్‌కర్నూల్‌లో భారీ చోరీ

- 9.5 కిలోల వెండి అపహరణ

నాగర్‌కర్నూల్, ఫిబ్రవరి 28: జిల్లా కేంద్రంలో లక్ష్మీనగర్ కాలనీలో తాళం వేసి ఉన్న ఓ ఇంట్లో దుండగులు మంగళవారం రాత్రి భారీ దొంగతనానికి పాల్పడ్డారు. బుధవారం చోరీ జరిగిన విషయాన్ని గుర్తించి కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయగా క్లూస్‌టీం బృందం వచ్చి పరిశీలించారు. లక్ష్మీనగర్‌లో నివాసం ఉంటున్న మిడిదొడ్డి బుచ్చయ్య అనే వ్యక్తి కుటుంబ సభ్యులతో కలిసి మంగళవారం సాయంత్రం హైదరాబాద్ వెళ్లారు. దీంతో బుధవారం వచ్చి చూడగా తాళాలు విరగ్గొట్టి ఉండడంతో దొంగతనం జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దుండగులు ఇంట్లో ఉన్న 9.5 కిలోల వెండి దొంగిలించినట్లు ఎస్సై గోవర్ధన్ తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

★హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్: 6K. Ph: 9640468899 / 9640258899.

NT-319447-All

ప్రకటన

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన లీతిలో క్షుణ్ణంగా వివారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

To Book your Classified
4 lines Advt
Rs. 200/-
Only (B/W)
Additional Line
50/- Only
For Advertisement Enquiry
Please Contact...
9182777641
9182777654
9182777794

ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం

నాగర్‌కర్నూల్‌టౌన్, ఫిబ్రవరి 28 : పట్టణంలోని ప్రీజమ్ స్కూల్‌లో బుధవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. డీఎస్పీ శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థుల సైన్స్ ప్రాజెక్టులను ఆసక్తిగా తిలకించి వివరాలను అడిగి తెలుసుకొని విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ స్వప్న, వైస్ ప్రిన్సిపాల్ దేవేందర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు. శ్రీ చైతన్య పాఠశాలలో విజ్ఞాన శాస్త్ర ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నరేశ్ బాబు పాల్గొని ప్రయోగాలను తిలకించారు.

కల్వకుర్తిలో..

కల్వకుర్తి రూరల్, ఫిబ్రవరి 28 : పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, రఘుపతిపేట, తర్నికల్, ఎల్లికల్, మార్చాలలో కల్వకుర్తిలో ప్రైవేట్ పాఠశాలలో సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించారు.

ఊర్కొండలో..

ఊర్కొండ, ఫిబ్రవరి 28 : మండలంలోని ఊర్కొండపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో గత మూడు రోజులుగా విద్యార్థులు వివిధరకాల సైన్స్ కార్యక్రమాలు నిర్వహించారు.

బిజినేపల్లిలో..క్విజ్ పోటీలు

బిజినేపల్లి, ఫిబ్రవరి 28 : మండలంలోని పాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా క్విజ్, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎం వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు పూర్ణచంద్రకళ, రాజు ఉన్నారు.

అమ్రాబాద్‌లో..

అమ్రాబాద్, ఫిబ్రవరి 28 : మండలంలోని జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జెడ్పీ బాలుర పాఠశాలలో జాతీయసైన్స్ దినోత్సవాన్ని హెచ్ఎం బాలకిషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సైన్స్ ఉపాధ్యాయులకు సన్మానించారు.

లింగాలలో..

లింగాల, ఫిబ్రవరి 28 : విద్యార్థులు శాస్త్ర సాంకేతిక రంగాల్లో రాణించాలని హెచ్ఎంలు శేఖర్, తాహేర్‌పాషా అన్నారు. బుధవారం మండలంలోని అంబట్‌పల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో జాతీయసైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఉన్నత పాఠశాలలో సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో హెచ్ఎం ఉపాధ్యాయులు వెంకట్ రాజు, అరవింద్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

తాడూరులో..

తాడూరు, ఫిబ్రవరి 28 : మండలంలోని సిర్సవాడ గ్రామంలోని జెడ్పీహెచ్ఎస్, ఎంపీపీఎస్ ప్రభుత్వ పాఠశాలల్లో బుధవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

తిమ్మాజిపేటలో..

తిమ్మాజిపేట, ఫిబ్రవరి 28: మండల కేంద్రంలో హైస్కూల్‌లో సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యాసరచన, ఉపన్యాస, సైన్స్ ముగ్గులు, క్విజ్, సైన్స్ ఎగ్జిబిషన్ పోటీలను నిర్వహించారు. హెచ్ఎం సత్యనారాణశెట్టి తదితరులు పాల్గొన్నారు.

అచ్చంపేటలో..

నాగర్‌కర్నూల్‌లో శ్రీ చైతన్య పాఠశాలలో ప్రదర్శనలను తిలకిస్తున్న మున్సిపల్ కమిషనర్

అచ్చంపేట రూరల్, ఫిబ్రవరి 28 : పట్టణంలోని శ్రీచైతన్య పాఠశాలలో బుధవారం సైన్స్ డేను జరుపుకొన్నారు. వివిధ రకాల ప్రాజెక్టులను ప్రదర్శించి తమ సృజనాత్మకతను చాటుకున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కొల్లాపూర్‌లో...

కొల్లాపూర్,ఫిబ్రవరి 28: జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో బుధవారం ఘనంగా నిర్వహించుకున్నారు. ప్రిన్సిపాల్ రామరాజుయాదవ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మ్యాథ్స్, కెమిస్ట్రి, ఫిజిక్స్, జూవాలజీ విభాగాల ఆధ్వర్యంలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఉదయ్‌కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఊర్కొండలో సీవీ రామన్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఉపాధ్యాయులు



లింగాలలో సీవీ రామన్ చిత్రపటానికి నివాళుల అర్పిస్తున్న ఉపాధ్యాయులు

అచ్చంపేటలో ప్రాజెక్టులను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

ప్రశాంతంగా ప్రారంభమైన ఇంటర్ పరీక్షలు

- మొత్తం విద్యార్థులు 7,291
- హాజరైన వారు 6,854
- 437 మంది గైర్హాజరు

నాగర్‌కర్నూల్, ఫిబ్రవరి 28: జిల్లాలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. మొదటిరోజు జరిగిన ఇంటర్ మొదటి సంవత్సరం రెండో భాషపేపర్-1 పరీక్షకు మొత్తం 6,854 మంది విద్యార్థులు హాజరు కాగా, 437మంది గైర్హాజరైనట్లు జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి వెంకటరమణ పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా 32 పరీక్షా కేంద్రాల్లో జనరల్, ఒకేషనల్‌లో కలిపి 7,291మంది మొదటి సంవత్సరం విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 6,854మంది హాజరయ్యారన్నారు. జిల్లాలో మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని, ప్రశాంతంగా పరీక్ష జరిగిందని, 437మంది గైర్హాజరయ్యారని తెలిపారు. జనరల్ అభ్యర్థులు 5,748మందికి గానూ 5,436 మంది హాజరు కాగా 312మంది గైర్హాజరయ్యారని, ఒకేషనల్‌లో 1,543 మందికి గానూ 1,418మంది హాజరుకాగా, 125మంది గైర్హాజరయ్యారన్నారు. పరీక్షల సందర్భంగా జిల్లా కేంద్రంలోని గీతాంజలి, ప్రభుత్వ బాలికల, బాలుర, శ్రీనివాస, పద్మావతి కళాశాలలో కొనసాగుతున్న కేంద్రాలను నోడల్ అధికారి తనిఖీ చేశారు. ఇంటర్‌బోర్డు అధికారులు జిల్లాలోని పలు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసినట్లు తెలిపారు. మొదటిరోజు మొత్తం 94శాతం హాజరయ్యారని నోడల్ అధికారి తెలిపారు.

కల్వకుర్తిలో..

కల్వకుర్తి రూరల్, ఫిబ్రవరి 28 : పట్టణంలో ఆరుకేంద్రాలు ప్రభుత్వ జూనియర్ కళాశాల, వైఆర్ఎం కళాశాల, న్యూఎరా కళాశాల, కృష్ణవేణి జూనియర్ కళాశాల, ఎంజేపీ కల్వకుర్తి, ఎంజేపీ ఊర్కొండ, ట్రైబల్ వెల్ఫేర్ కళాశాలలో బుధవారం ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మొదటిరోజు పరీక్షకు 1,558 మంది విద్యార్థులకు గానూ 1,473 హాజరుకాగా 98 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు.సీసీ కెమెరాల పర్యవేక్షణలో పరీక్ష నిర్వహించినట్లు ఎగ్జామ్ చీఫ్, ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ సురేందర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం సెకండియర్ పరీక్షలు ప్రారంభం కానున్నాయన్నారు.

నలుగురు గైర్హాజరు

తిమ్మాజిపేట, ఫిబ్రవరి 28: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్షలు బుధవారం ప్రశాంతంగా జరిగాయి. మొదటిరోజు తెలుగు పేపర్-1 పరీక్షకు 155 మందికి గానూ 151 మంది హాజరైనట్లు పరీక్షల నిర్వాహణాధికారి వెంకన్న తెలిపారు.

63మంది విద్యార్థులు గైర్హాజరు

కొల్లాపూర్,ఫిబ్రవరి 28: ఇంటర్ ఫస్టియర్ పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. కొల్లాపూర్ పట్టణంలో మొత్తం నాలుగు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. నాలుగు పరీక్షా కేంద్రాల్లో 687మంది విద్యార్థులకు గానూ 624మంది పరీక్షలు రాయగా, 63మంది గైర్హాజరయ్యారు.

నాగర్‌కర్నూల్‌లో పరీక్షలకు హాజరైన విద్యార్థులు

గవర్నర్ చేతుల మీదుగా బంగారు పతకాన్ని అందుకుంటున్న రహీంఖాద్రి

కోడేరు వాసికి బంగారు పతకం

కోడేరు, ఫిబ్రవరి 28: మండల కేంద్రానికి చెందిన రహీం ఖాద్రికి పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం వారు బంగారు పతకాన్ని బుధవారం అందజేశారు. జీఎస్ గబ్రీయల్ పర్యవేక్షణలో అదురే ముస్లిం కథలు భాష శైలి విశ్లేషణ అనే అంశంపై పరిశోధన చేయడంతో విశ్వవిద్యాలయం వారు పతకానికి ఎంపిక చేశారు. హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో గవర్నర్ తమిళిసై చేతుల మీదుగా బండారు పతకాన్ని ఆయన అందుకున్నారు. ఈ సందర్భంగా రహీంఖాద్రిని ప్రొఫెసర్లు, స్నేహితులు, విద్యావంతులు కుటుంబీకులు అభినందించారు.

వైభవంగా పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠా

వెల్దండ, ఫిబ్రవరి 28 : మండలంలోని బైరాపూర్ గ్రామంలో పెద్దమ్మతల్లి దేవత, పోతురాజు విగ్రహ ప్రతిష్ఠా ఉత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. బుధవారం ఆలయం ఎదుట ధ్వజస్తంభం, యంత్ర, విగ్రహాలను ప్రతిష్ఠించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మల్లేశ్‌యాదవ్, గ్రామపెద్దలు, భక్తులు ఉన్నారు.

పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

వెల్దండ, ఫిబ్రవరి 28 : మండలంలోని కొట్ర చౌరస్తాలో విద్యాశాఖ నిబంధనలకు వ్యతిరేకంగా కొనసాగిస్తున్న శాస్త్ర స్కూల్‌పై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకుడు సంతోశ్‌నాయక్ ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థి సంఘాల నాయకులు ఎంఈవో శంకర్‌నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు మహేశ్, రాహుల్, మల్లేశ్ ఉన్నారు.

అచ్చంపేట ఆర్డీవోగా మాధవి

అచ్చంపేట, ఫిబ్రవరి 28 : అచ్చంపేట నూతన ఆర్డీవోగా మాధవిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసింది. ఇటీవల గద్వాల నుంచి అచ్చంపేట ఆర్డీవోగా బదిలీపై వచ్చిన సుబ్రమణ్యం నల్గొండ జిల్లాకు బదిలీఅయ్యారు. హైదరాబాద్ నుంచి అచ్చంపేట ఆర్డీవోగా మాధవిని నియమించారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఆర్డీవోల బదిలీలు జరిగాయి. ఈ సందర్భంగా ఆమె రెండురోజుల్లో బాధ్యతలు చేపట్టనున్నట్లు తెలిసింది.

అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలి

అమ్రాబాద్, ఫిబ్రవరి 28 : మండల, గ్రామ ప్రత్యేక అధికారులు ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉండాలని డీఆర్డీవో నర్సింగరావు తెలిపారు. బుదవారం మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో మండలాధికారులు, పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బందితో వారాంతపు రివ్యూ సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రజలకు ఎలాంటి సమస్యలు లేకుండా చూసుకోవాలని వేసవికాలం సమీపించడంతో తాగునీటికి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఎంపీవో వెంకటయ్య, పంచాయతీ కార్యదర్శులు, టీఏ, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

కొలువైన అమ్మవారు

నేడు గంగాభవాని కల్యాణోత్సవం

కొల్లాపూర్,ఫిబ్రవరి 28: పట్టణంలోని గంగపుత్ర సంఘం, మత్స్య పారిశ్రామిక సహకార సంఘం, ఆలయ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో 32వ వార్షికోత్సవం సందర్భంగా ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. గంగాభవాని పంచాయతన దేవస్థానంలో గంగాభవాని అమ్మవారి కల్యాణోత్సవం గురువారం 11:05గంటలకు కనుల పండుగా నిర్వహించేందుకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఉదయం 10గంటలకు వస్త్ర సమర్పరణ,11:05 కల్యాణోత్సవం, మధ్యాహ్నం ఒంటి గంటకు భక్తులకు అన్నదానం, సాయంత్రం 4గంటలకు తెప్పోత్సవం, 5గంటలకు రథోత్సవం,శోభాయాత్ర కార్యక్రమాలు కొనసాగనున్నాయి. గంగాభవాని అమ్మవారికి తొలిపూజ కార్యక్రమాన్ని మాజీ సంస్థానాధీశులు రాజా సురభి వెంకటకృష్ణ బాలాదిత్య లక్ష్మారావు నిర్వహిస్తారని నిర్వాహకులు తెలిపారు.

కోడ్ కూసినా..తొలగని పోస్టర్లు, కటౌట్లు

కొల్లాపూర్ /కోడేరు, ఫిబ్రవరి 28: రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమలులో ఉన్నా నియోజకవర్గంలో మాత్రం ఎన్నికల నియామళిని సంబంధిత శాఖ అధికారులు పాటించడం లేదని సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినా గోడలపై వివిధ రాజకీయపార్టీల వాల్‌పోస్టర్లు అదే విధంగా పెద్ద పెద్ద కటౌట్లు తొలగించడం లేదు. ఎన్నికల నియమావళి ప్రకారం ఆయా రాజకీయపార్టీల గుర్తులు గానీ, జెండాలు వాల్‌పోస్టర్లు, కటౌట్లు రోడ్లపై ఎక్కడా కనిపించకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. కానీ నియోజకవర్గ కేంద్రం, కోడేరు మండలకేంద్రంతో పాటు ఆయాగ్రామాలో రోడ్లపై గోడలపై విచ్చలవిడిగా వాల్‌పోస్టర్లు, కటౌట్లు వెలిసినా ఇక్కడి అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు పెదవి విరుస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఎన్నికల నిబంధనలను పాటించాలని ప్రజలు కోరుతున్నారు.

కొల్లాపూర్ : మాధవస్వామి ఆలయ సమీపంలో కాంగ్రెస్ గోడపత్రికలు

కోడేరు బస్టాండ్ వద్ద ఓ రాజకీయ పార్టీ కటౌట్

ఫ్లెక్సీల తొలగింపు

నాగర్‌కర్నూల్‌టౌన్, ఫిబ్రవరి 28 : ప్రస్తుతం ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన కోడ్ అమలులో ఉండడంతో మున్సిపల్ కమిషనర్ నరేశ్‌బాబు ఆదేశంతో బుధవారం పట్టణంలోని పలు రాజకీయ నాయకులకు సంబంధించిన ఫ్లెక్సీలు, బ్యానర్లు, జెండాలను మున్సిపల్ సిబ్బంది తొలగించారు. ఎన్నికల కోడ్ ముగిసే వరకు రాజకీయ నాయకులకు సంబంధించిన ఫొటోలు, ఫ్లెక్సీలు పెట్టరాదని సూచించారు.

శ్రీశైలంలో శివస్వాముల ఆందోళన

- దేవస్థానం ఏర్పాట్లు - దర్శనాలపై అసహనం
- ఈవో డౌన్ డౌన్ అంటూ నినాదాలు

శ్రీశైలం, ఫిబ్రవరి 28 : శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జునస్వామి అమ్మవార్లను దర్శించుకునందుకు వచ్చిన శివస్వాములు దేవస్థానం ఏర్పాట్లు దర్శన విధానాలపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ క్యూలైన్లలో ఆందోళనకు దిగారు. బుధవారం క్షేత్రానికి వచ్చిన స్వాములు సుమారు 5 గంటలకు పైగా క్యూలైన్లో వేచి ఉన్నప్పటికీ స్వామిఅమ్మవార్ల దర్శనం కల్పించకపోవడంతో పాటు కనీసం అప్పాహారములు, మంచినీరు కూడా అందించలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సహనం కోల్పోయి ఆలయ ఈవో డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. అధికారులు సామాన్య భక్తుల దర్శనాలను నిర్లక్ష్యం చేస్తూ అర్జిత వీఐపీ దర్శనాలకు అధిక ప్రాధాన్యత ఇవ్వడం సమంజసం కాదని శివస్వాములు ఆందోళన చేయడంతో సహ యాత్రికులు కూడా అధికారులు సిబ్బందితో వాగ్వివాదానికి దిగారు. ఈవో పెద్దిరాజు మాట్లాడుతూ ప్రతిఒక్కరికీ స్వామి అమ్మవార్ల దర్శనం కల్పించుటకు తగిన ఏర్పాట్లు చేసినప్పటికీ భక్తులు కూడా సహకరించాలని కోరుతున్నారు. పాదయాత్రలు చేసి వచ్చేవారికి ప్రాధాన్యత కల్పిస్తూ వీలైనంత త్వరగా దర్శనం కల్పించేందుకు ప్రయత్నిస్తున్నామని ఈవో తెలిపారు.

బీజేపీని బలహీన పర్చడానికి కాంగ్రెస్ కుట్రలు

- కాగజ్‌నగర్ సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వయి హరీశ్‌బాబు

అచ్చంపేట రూరల్, ఫిబ్రవరి 28 : తెలంగాణ కాంగ్రెస్ రాష్ట్రంలో బీజేపీని బలహీన పర్చడానికి కుట్రలు చేస్తుందని కాగజ్‌నగర్ సిర్